అర్హులకు గొప్ప వరం 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కృష్ణాపురంలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బాలరాజు

భీమునిపట్నం: అర్హత ఉన్నప్పటికీ సరైన ధ్రువీకరణ పత్రాలు పొందలేనివారికి జగనన్న సురక్ష గొప్ప వరం లాంటిదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 3వ వార్డు పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అర్హులుండి, వారికి పథకాలు అందడంలో ఇబ్బందులు ఎదురైతే నష్టపోకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. దీనివల్ల ఎంతో మందికి మేలు జరుగుతోందని, ఇక్కడ 872 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థల వల్ల దళారుల ప్రమేయం లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్ని ప్రయత్నాలు చేసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే తనను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకులు పి.బాలరాజు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎంతో మంచి జరిగిందని, మళ్లీ ఆయనకే అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్టు తెలిపారు. సర్టిఫికెట్లు ఎవరికైనా రాకపోతే ఆందోళన చెందవద్దన్నారు. ఈ నెల 23 వరకు జారీ చేస్తారన్నారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, సర్పంచ్‌లు ఎం.లక్ష్మి భవానీ, టి.పాప, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.అప్పలనాయుడు, బి.అప్పలనాయుడు, టి.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరికి ఊహించని మేలు



బౌరుశెట్టి ఉమా మహేశ్వరి

స్థానిక చిన్నబజారు సమీపంలోని అప్పికొండ వీధికి చెందిన బౌరుశెట్టి ఉమా మహేశ్వరి (50) అనే ఎస్సీ మహిళకు కలలో కూడా ఊహించని మేలు జరిగింది. ఈమెకు భర్త లేకపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పింఛన్ రావడం లేదు. దాన్ని ఎలా పొందాలో కూడా తెలియని నిస్సహాయ స్థితిలో ఎన్నో సంవత్సరాలు ఉండిపోయింది. ఇప్పుడు ఒక్కసారిగా ఊహించని విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పింఛన్ పొందడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు రావడంతో ఆమె అర్హత సాధించింది. ఇక జీవితంలో పింఛన్ రాదని నిరాశతో ఉన్న ఆమెకు అర్హత లభించడంతో ఆనందానికి అవధులు లేకుండాపోయింది. ఇందుకు కారణమైన సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

స్వయం సహాయక సంఘాలకు రూ.1.35 కోట్లు



రుణాలు అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: యూనియన్ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండలంలోని మద్ది గ్రామంలో పద్మనాభం యూనియన్ బ్యాంకు తొమ్మిది స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన రూ.1.35 కోట్ల రుణాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పంట రుణాలు, ఆవుల కొనుగోలుకు, ఎడ్యుకేషన్‌కు, స్వయం సహాయక సంఘాలకు రుణాలను యూనియన్ బ్యాంకు మంజూరు చేస్తుందన్నారు. బ్యాంకు రీజినల్ ఆర్డీవో ఫణికుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు ఎటువంటి సూరిటీ తీసుకోకుండా రూ.20లక్షల వరకు రుణం ఇస్తున్నామన్నారు. మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్డీవో మానస రాణి, డీబీహెచ్ అశోక్‌బాబు, బ్యాంకు మిత్ర కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

డీసీఆర్ సేవా రథం ప్రారంభం



సేవా రథాన్ని ప్రారంభిస్తున్న ఐజీ రంగారావు, దుర్గాశేఖర్ తదితరులు

భీమునిపట్నం: కీతిన్‌పేట సమీపంలోని సన్ స్కూల్ వద్ద మంగళవారం పేదలకు సేవలు అందివ్వడానికి ఏర్పాటు చేసిన డీసీఆర్ సేవ రథం ప్రారంభించారు. తగరపువలసకు చెందిన దుర్గాశేఖర్ సొంత నిధులతో ఈ రథాన్ని ఏర్పాటు చేయగా భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐజీ ఎల్.కె.వి.రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి కార్యక్రమం కోసం దీన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.ఎల్.రావు, రాజేటి బసవ కృష్ణమూర్తి, అడిదం కిశోర్, ముసునూరి సూర్య శ్రీనివాస్, కాళ్ల సన్నీ, వెంపాడ శ్రీనివాసరెడ్డి, ముమ్మిడిశెట్టి ఆదిత్య పాల్గొన్నారు.

టీకాతోనే బ్రూసెల్లోస్ వ్యాధి నియంత్రణ



చంద్రంపాలెంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న వైద్యురాలు అనుపమ

మధురవాడ: బ్రుసెల్లోస్ ఒక అంటు వ్యాధి అని, పశువుల నుంచి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధి అని చంద్రంపాలెం పశువైద్య కేంద్రం వైద్యురాలు ఆర్.అనుపమ చెప్పారు. పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో పిలకవానిపాలెం, చంద్రంపాలెం పరిసర ప్రాంతాల్లో పశువులకు మంగళవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన తర్వాత చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. దీనికి నివారణ లేదని, టీకాలు వేయించడమే ఏకైక మార్గం అని తెలిపారు. అందుకోసమే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం ద్వారా పశువులకు టీకాలు ఉచితంగా వేస్తోందని, అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే రోడ్డు డ్రైనేజీలో పూడిక తొలగిస్తున్న జేసీబీ

పీఎం పాలెం: పారిశుధ్యం మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మధురవాడ జోన్ జెడ్సీ కనక మహాలక్ష్మి చెప్పారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. జోన్ పరిధిలోని కాలువలు, గెడ్డల్లో పేరుకుపోయిన పూడికను మినీ జేసీబీలతో మంగళవారం తొలగించారు. ఆ పనులను ఆమె పర్యవేక్షించారు. బాధ్యతారాహిత్యంగా వ్యర్థాలు, చెత్త రోడ్డుపై వేసే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

టీబీ రోగులకు పౌష్టికాహారం



పౌష్టికాహార కిట్ అందజేస్తున్న మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి

మధురవాడ: క్షయ రోగులకు అరబిందో అందజేసిన పౌష్టికాహార కిట్స్ మంగళవారం మధురవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారిణి ప్రశాంతి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నెల రోజులకు సరిపడా గోధుమపిండి, రాగిపిండి, వేరుశనగ పప్పు, 15 గుడ్లు, ఒక న్యూట్రిషన్ పౌడర్ ప్యాకెట్ తదితర 7 రకాల వస్తువులతో కూడిన కిట్‌లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోగులు తగు జాగ్రత్తలతోపాటు పౌష్టికాహారం తీసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బోని సూర్యనారాయణ, దుంపల దాలినాయుడు, కె.వసుంధర దేవిలను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సబ్బం రామారావు, గౌరినాయుడు, సంగు నాగరాజు పాల్గొన్నారు.

రేపు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సినేషన్

మధురవాడ: అంతర్జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడ జీవీఎంసీ జోనల్ ఆఫీసు సమీపంలోని చంద్రంపాలెం పశువైద్య కేంద్రంలో ఈ నెల 6న (గురువారం) ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తామని వైద్యాధికారి ఆర్.అనుపమ చెప్పారు. పిచ్చి కుక్కలు ద్వారా మనుషులకు వచ్చే ప్రాణాంతకమైన వ్యాధి ర్యాబిస్ అన్నారు. కుక్క చొంగ ద్వారా కూడా ఇది వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి లక్షణాలు బయటపడిన తర్వాత చికిత్స లేదన్నారు. ఈ వ్యాధి సోకకుండా ఉండాలంటే పెంపుడు కుక్కలకు ఏటా ర్యాబిస్ నిరోధర టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాక్సినేషన్‌ను అంతా సద్వినియోగం చేసుకోవాలని అనుపమ కోరారు.

గీతంలో మైక్రో వాసుక్యులర్ వర్క్‌షాప్

కొమ్మాది: గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ఓరల్ మేక్సియో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో దంత వైద్యులకు మైక్రో వాసుక్యులర్‌పై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు విభాగం అధిపతి డాక్టర్ ఎస్.వి.వి.సత్యభూషణ్ తెలిపారు. చెన్నైకు చెందిన సవిత దంత వైద్య కళాశాల శస్త్ర చికిత్స విభాగం నిపుణులు సెంథిల్ మురుగన్, కార్తీరవన్‌లు రిసోర్స్‌పర్సన్లుగా హాజరై ముఖానికి జరిగే శస్త్ర చికిత్స విధానాన్ని వివరించారు. దంత వైద్యులకు కింద దవడ, శస్త్ర చికిత్స కాలి ఎముకను ఆధారంగా చేసుకుని శస్త్ర చికిత్స జరిపే విధానాలను నిపుణులు ప్రత్యక్షంగా చేసి చూపించారు.

గాయపడిన విద్యార్థికి పరామర్శ

మధురవాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రియదర్శిని కాలనీలో నివసిస్తున్న చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.రాజేష్‌ను మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం పరామర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి 9వ తరగతి చదువుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వీరిలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సూర్యప్రకాశరావు, ప్రదీప్ కుమార్, టి.ఆశాస్వరూప్, వరలక్ష్మి, కావ్యారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలి



కొమ్మాది జంక్షన్ సమీపంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

మధురవాడ: భవన నిర్మాణ కార్మికులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కొమ్మాది జంక్షన్ సమీపంలో మంగళవారం ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ మధురవాడ పరిసర ప్రాంతాల్లో రోజురోజుకూ భారీ నుంచి అతి భారీ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇందులో పనిచేయించుకునే యజమానులు రక్షణ చర్యలు చేపట్టకుండా కార్మికుల మరణాలకు కారకులౌతున్నారని ఆరోపించారు. తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా జీవీఎంసీ, కార్మిక శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అప్పలరాజు, పి.రాజశేఖర్, ప్రి.ప్రసాద్, ఆర్.తాతారావు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని మహారాణిపేట ప్రాంతానికి చెందిన భవిరిశెట్టి వెంకట సత్య రాంప్రసాద్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని నగదురూపంలో ఆలయంలో సూపరింటెండెంట్ సునీల్‌కు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థికి పరామర్శ



ఆస్పత్రిలో విద్యార్థితో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పీఎం పాలెం: జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.సుమంత్ (14) అనే విద్యార్థిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం రాత్రి పరామర్శించారు. విద్యార్థికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్, స్థానిక నాయకులు పోతిన ప్రసాద్, పిళ్లా సూరిబాబు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, రాయన సాయికుమార్ పాల్గొన్నారు. జాతీయ రహదారి దాటి హైస్కూల్‌కు వెళ్తుండగా సోమవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే.


నాటి నిస్వార్థ నాయకుల వల్లే స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం



సమావేశంలో ప్రసంగిస్తున్న మస్తానప్ప

ఉక్కునగరం: నాటి నిస్వార్థ రాజకీయ నాయకుల వల్లే విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఆవిర్భవించిందని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప అన్నారు. దేశంలోని 5వ ప్రతిపాదిత ఉక్కు కర్మాగారం విశాఖలో నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానానికి 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చిన నేపథ్యంలో అప్పటికే మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయాలని నాటి నాయకులు సంకల్పించారన్నారు. 1965 జూలైలో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయించారన్నారు. అటువంటి ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను కాపాడుకుంటేనే భవిష్యత్



దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 873వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్‌ఈడీ, పస్టెం, స్టోర్స్, ఎస్ఎండీ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం ఆదర్శనీయం



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యుడు నరేష్ తదితరులు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాసురాజు తదితరులు

మధురవాడ: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలనే తృణప్రాయంగా అర్పించిన అల్లూరి సీతారామరాజు నేటి తరానికి ఆదర్శనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆ మహనీయుని 126వ జయంతిని పురస్కరించుకుని మధురవాడలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోరాట స్ఫూర్తిని, త్యాగ నిరతిని కొనియాడారు.

- గణేష్‌నగర్ వద్ద అల్లూరి సీతారామరాజు నగర్‌లోని ఏఎస్ఆర్ పార్కులో మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యుడు ఎ.నరేష్, సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి తాతపూడి ప్రదీప్ కుమార్, కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, ఎన్.బాబ్జి, పెంద్ర అప్పన్న, వరలక్ష్మి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- సీపీఐ మధురవాడ ఏరియా సమితి ఆధ్వర్యంలో వి.సత్యనారాయణ, త్రినాథ్, తిరుపతిరావు, మోహన్ తదితరులు నివాళులర్పించారు.
- కొమ్మాది జంక్షన్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, వర్మరాజు, జి.కిరణ్, చిన్నారావు, నాగేశ్వరరావు నివాళులర్పించారు.

పద్మనాభం: అల్లూరి జయంతి సందర్భంగా పాండ్రంగిలో ఉన్న సీతారామరాజు విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమునిపట్నం మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎస్.మాధవ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీఎం పాలెం: శిల్పారామంలోని జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.ప్రభాకరరాజు, కార్యదర్శి అరవింద్, సూర్యకుమార్, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు భీమిలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీచ్ సమీపంలోని అల్లూరి పార్కులోని ఆయన విగ్రహానికి జీవీఎంసీ 3వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. నాయకులు వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కోండ్రు రామసూరప్పడు, ఎర్నింటి అచ్చిబాబు, మైలిపల్లి లక్ష్మణరావు, బాకి రమణారెడ్డి, వాసుపల్లి ఎల్లాజీ, ప్రగడ చంటి పాల్గొన్నారు.

- మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు జీవితంపై డాక్యుమెంటరీ



డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న కుమార్ తుహిన్

ఏయూ క్యాంపస్: అల్లూరి సీతారామరాజు జీవితంపై విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి డాక్టర్ కె.సత్యనారాయణ అధ్యయనం చేసి తీర్చిదిద్దిన డాక్యుమెంటరీని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్(ఐసీసీఆర్) డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్ ఆవిష్కరించారు. అల్లూరి జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను సమగ్రంగా దీనిలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటా విక్రయాలు

మధురవాడ: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర భారీగా పెరగడంతో ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతు బజార్లలో సబ్సిడీపై రూ.50కే కిలో టమోటాలు అందిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం మధురవాడ రైతు బజార్‌లో 2,130 కిలోల టమాటాలు అందించారు. ఒక ఆధార్ కార్డుకి కిలో చొప్పున ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ ఆధ్వర్యంలో విక్రయించారు.

అంధకారంలో షుగర్‌కేన్ కాలనీ రోడ్డు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం షుగర్‌కేన్ కాలనీ లే అవుట్‌కు వెళ్లే రోడ్డులో చీకటి పడితే అంధకారం రాజ్యమేలుతోంది. స్థానిక రెండో నంబరు బస్టాపు నుంచి లే అవుట్‌కు వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం నుంచి రాకపోకలు సాగించే వారు ఈ రోడ్డులోనే ప్రయాణం చేయాలని... వీధి లైట్లు లేని కారణంగా చీకటి పడితే బిక్కుబిక్కుమంటూ ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు.